

# జాతక కథ

బి. అజయ్‌ప్రసాద్

హింస అంటే ఆయుధం కాదు- కారణమని తెలుసుకున్నప్పుడు నిజంగా నేను భయపడ్డాను. అప్పటివరకు మానవాళిని అనాదిగా పట్టి పీడిస్తున్న అశాంతి, దుఃఖాలకు మానవుల వైయక్తిక రుగ్మతలే కారణమనుకున్న నా అభిప్రాయం పటాపంచలయింది.

వాటికి గల సామాజిక కారణాలు అర్థమయిన తరువాత వాటి నుంచి మానవాళికి విముక్తి పొందే మార్గం అత్యంత దుర్లభంగా కనిపించింది. మానవజాతి చరిత్రలో నా అనుభవాలు ఎప్పుడూ ఎవరికీ కొత్త కాక పోవచ్చు కాని మనిషి జాతకంలో తీరని అశాంతికి, అపారమైన దుఃఖానికి సర్వకాలావస్థల్లోనూ కారణాలు ఒకటే అన్నది నేను తెలుసుకున్న సత్యం. ఇది బ్రహ్మదత్తుడి కాలంలో బోధిసత్వుడు జన్మించి చెప్పిన జాతక కథ కాదు.

మగధ సామ్రాజ్యానికి ఉత్తరదిశలోని హిమ పర్వత పాదాల వద్ద ఒక బౌద్ధారామంలో నా చదువు పూర్తయిన కాలంలో బౌద్ధం చాలా క్షీణదశలో ఉందనే చెప్పాలి. అశోకుని ధమ్మపథంతో బౌద్ధం విస్తరించింది. కానీ అతడిలో సామ్రాజ్యకాంక్ష నశించడంతో మౌర్య సామ్రాజ్య వారసత్వం కొనసాగలేదు. ఆ తరువాత వచ్చిన చిన్న చిన్న రాజవంశాలు, గుప్తులు బౌద్ధాన్ని ఆదరించలేదు. హూణుల దండయాత్రతో గుప్త సామ్రాజ్యం కూడా అంతరించి పోయింది.

ఇక బౌద్ధం ఆదిమకాలంలో సాంఘిక ఉద్యమంగా విస్తరించినా తథాగతుని మరణానంతరం హీనయాన, మహాయాన బౌద్ధాలుగా విడిపోయింది. జనాకర్షణ లేని అనాత్మవాదం, బుద్ధుని భగవంతునిగా పూజించరాదనే హీనయాన దృక్పథం బౌద్ధం అంతరించడానికి కారణమౌతుందని భావించి అనేకమంది భిక్షువులు, మేధావులు, రాజులు, ప్రజలు మహాయానంవైపు మొగ్గు చూపడంతో హీనయాన బౌద్ధానికి ఆదరణ కరువైంది. గౌతమబుద్ధుని బోధనలను అనుసరించే వారు అతడిని భగవంతునిగా పూజిస్తే తప్పేమిటి? తథాగతుడు పూజా పునస్కారాలను తిరస్కరించుగాక, అది ఆయన నిరాడంబరత.

ఇవి నేను విద్యనభ్యసించేనాటి సాంఘిక పరిస్థితులు. చదువు పూర్తయ్యాక సంఘనియమం ప్రకారం నేను భిక్షాయాత్ర చేయవలసి ఉంది. నిజంగా ఆ సుదినం కోసమే ఎన్నో రోజులుగా ఎదురుచూశాను. నా ప్రయాణంలో మొదట అశోకుడు పాలించిన మగధను, పాటలీపుత్రాన్ని, అతడు జయించిన కళింగను చూడాలని, బౌద్ధాన్ని విశిష్టంగా ఆదరించిన శాతవాహనులు పాలించిన ఆంధ్రదేశాన్ని చూడాలని నిర్ణయించుకున్నాను. బుద్ధ చరిత్రను విరచించిన అశ్వఘోషుని జన్మస్థానాన్ని కూడా చూసి రావాలని అప్పుడే నిశ్చయించుకున్నాను.

విహారంలో నా చదువు పూర్తయ్యాక మా గురువులు మహాస్థవిరులు నన్ను పిలిచి ఇలా చెప్పారు.

‘‘చూడు శ్రమణ్! భిక్షువులకు అధ్యయనం నిరంతరమైనది. నిజానికి అది ఎప్పుడూ జరిగే సాధన. ఆ తథాగతుని భౌతికధర్మాలైన ఆర్యసూత్రాలు, అష్టాంగ మార్గం, అహింసామార్గం ప్రపంచానికి ఎప్పటికీ అవసరం. ప్రపంచమే దానిని ఎప్పుడూ రుజువు చేస్తూ

ఉంటుంది. అలాగే సత్యం నిరంతరం అన్వేషించబడు తూనే ఉంటుంది. ప్రతీత్య సమూత్పాదంలాగ అది నిరంతరం భౌతిక పరిస్థితులతో కలిసి పరిణామం చెందుతూనే ఉంటుంది. భిక్షాపాత్ర చాచడమే భిక్షువుల లక్ష్యం కాదు. అనంతమైన మానవజగత్తు శాంతి లేక అనేక సమస్యలతో నీ ముందు భిక్షాపాత్ర చాచి ఉంది. తథాగతుని ధర్మోపదేశంతో వారికి దుఃఖ నివారణ చేసి శాంతితో వారి భిక్షాపాత్ర నింపడమే మన అంతిమ లక్ష్యం,'' అని చెప్పి మహాస్థవిరులు నన్ను ఆశీర్వదించారు.

మహాస్థవిరుల వద్ద, నా ఇతర సహాధ్యాయులు, మిత్రుల వద్ద సెలవు తీసుకున్న అనంతరం నా యాత్ర ప్రారంభించాను. నేను నడిచేకొద్దీ మా విహారం కను మరుగవుతూ పోయింది. దూరం ఎక్కువైనకొద్దీ ఎత్తైన ప్రదేశంలో నుంచుని చూసినప్పుడు అదొక ఎడారిలో ఉండే ఎండమావిలాగానో లేక నదీతీరాన్ని ఆనుకొని ఉన్న చిన్న అరణ్యంలాగానో అనిపించేది. చివరిసారి రాత్రివేళ అది మిణుకుమంటున్న సుదూర దీపంలా అంతమైంది.

మొదట కొన్నిరోజులు నా ప్రయాణం ఆకాశాన్నంటిన పర్వతశ్రేణుల గుండా, దుర్గమమైన అరణ్యాల గుండా నిర్విఘ్నంగా కొనసాగింది. హిమపర్వత సరిహద్దుల నుంచి అనేక పర్వతారణ్య మైదాన ప్రాంతాలను దాటుకుంటూ అనేక జనసమూహాలను దాటి పోయాను. ప్రశాంతమైన పచ్చగడ్డి నదీతీరాలను, భయం గొలిపే మహాపర్వతాల రాతి బాహువులను తిలకిస్తూపోయాను. అన్నిటిలోనూ ఉన్నది రమణీయమైన ప్రకృతి శోభే.

కళింగరాజ్యం దాటిన పిదప నేనొక అరణ్యాన్ని దాటే ముందు కొందరు యాత్రికులు నన్ను వారించారు. సముద్రయానం చేసి గోదావరి నదీతీరాన్ని చేరవచ్చునని చెప్పారు. మార్గం మధ్యలో క్రూరమృగాలుంటాయని, దోపిడిదొంగల బారిన పడగలనని వారు హెచ్చరించారు. నేను వాళ్ల మాటలు సున్నితంగా తోసిపుచ్చి ముందుకు సాగిపోవడానికే నిశ్చయించుకున్నాను. నా వద్ద చినిగిపోయిన నా చీవరం, భిక్షాపాత్ర తప్పితే మరేమీ లేవు. వారు నాకొక నీళ్ల నింపుకొనే తోలుసంచి, కొన్ని దినాలకు అవసరమయ్యే రాగులు జొన్నలతో చేసిన రొట్టెలు ఇచ్చి కొన్ని జాగ్రత్తలు చెప్పి వెళ్లిపోయారు. దక్షిణ దేశానికి వెళ్లే కొందరు యాత్రికులతో నా నడక సాగించాను.

అంతు తెలియని భయంకరమైన కీకారణ్యం లోంచి నడక మొదలుపెట్టాను. దారిలో కనీవినీ ఎరుగని అనేక క్రూరమృగాలను, పేరు తెలియని పాడు పడిన దేవళాలను, శిథిలమై కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న రాజుల దుర్గాలను చూశాను. అవి ఎందుకోసం కట్టారో ఎవరికోసం కట్టారో ఎవరికీ తెలియదు. బహుశా రాజుల రహస్యస్థావరాలో, వన విశ్రాంతి గృహాలో అయి ఉండవచ్చునిపించింది. నాతో వచ్చినవారు కొద్దిరోజులకే దారి తప్పారు. వారు నన్ను దాటివెళ్లారో లేక వెనుకబడి ఉన్నారో తెలియదు. నిర్జనారణ్యంలో రోజుల తరబడి ఒంటరి ప్రయాణం చేస్తూ పోయాను.

ఒకరోజు సూర్యాస్తమయానికి చెట్టు కింద విశ్రాంతి తీసుకుంటుండగా ఎవరిదో మూలుగు వినిపించింది. మొదట ఏ క్రూర మృగానిదో అనుకున్నాను. ఒక్కక్షణంసేపు భయం కలిగింది. చెవులు రిక్కించి విన్నాను. ఎవరో మనిషి, 'దాహం... దాహం...' అని మూలుగుతున్నారు. 'ఎవరు,' అని పిలిచాను.

ఎవరూ పలకలేదు. కొద్దిసేపటి తర్వాత మళ్లీ మూలుగు వినిపించింది. శబ్దం వచ్చినవైపు వెతుక్కుంటూ వెళ్లాను. కొంచెం దూరంలో ఒక చెట్లపొదలో నుంచి ఆ మూలుగు వినిపిస్తూ ఉంది. ఆ దిశగా దగ్గరకు వెళ్లి అక్కడి దృశ్యం చూసి నిశ్చేష్టు డయ్యాను.

శరీరమంతా గాయాలపాలై రక్తం ఓడుతున్న ఒక స్త్రీ చావుబతుకుల మధ్య కొట్టుకులాడుతూ అక్కడ పడి ఉంది. దగ్గరకు వెళ్లి, "ఎవరు మీరు, ఇక్కడికి ఎలా వచ్చారు, ఏమైనా క్రూర జంతువులు దాడి చేశాయా?'' అనడిగాను.

ఆమె కళ్లు తెరవలేక కాళ్లుచేతులు కదపలేని స్థితిలో, "దాహం... దాహం...'' అని మూలిగింది. నావద్ద ఉన్న తోలుసంచిని తీసి ఆమె నోటి మీద నీరు పోశాను. ఆ నిర్భాగ్యురాలికి పెదాలు తెరవడానికి కూడా శక్తి లేదు. కొంచెం నీరు తాగిన తరువాత ఆమె కళ్లు తెరిచి నా వంక చూసింది. శరీరం స్వాధీనంలోకి రాలేదు. ఆమెలో గొంతుకతో ఇలా గొణిగింది.

"అడవి గుండా ప్రయాణం చేస్తున్నాం. నా భర్త నన్ను బంధువుల నుంచి దారి తప్పించాడు. ఇక్కడ నా ఆభరణాలు లాక్కుని నన్ను కత్తితో పొడిచి పారిపోయాడు.'' ఈ మాటలు ఆమె చాలా కష్టంమీద అనగలిగింది. అదీ తన గురించి చెప్పేటందుకే. చివరికామె, "అంతా మోసం,'' అని ఏదో గొణిగి తల వాల్చింది. ఆమె ప్రాణాలతో మిగలలేదని అర్థమయ్యింది.

భయంకరమైన నిర్జనారణ్యం మధ్యలో ఆ స్త్రీ మృతదేహం వద్ద చాలాసేపు కూర్చుండిపోయాను. చంద్రుని వెన్నెలలో రక్తంతో తడిసిన ఆమె చీర కనిపిస్తూ ఉంది. ఆమె దయనీయమైన మరణం చూసి హృదయం దుఃఖభారమైంది.

ఆమె దేహం నక్కలు, తోడేళ్లు మొదలైన జంతువుల బారిన పడకుండా అదే స్థలంలో గొయ్యి తీసి పూడ్చిపెట్టి మృగాలు మట్టిని తవ్వకుండా ఆమె సమాధిపైన ముళ్ల కంపలు పాతి ఆ ప్రదేశానికి దూరంగా వెళ్లి పున్నమిచంద్రుడు అరణ్యం మీద వెన్నెల వెదజల్లుతుండగా ఒక చెట్టు కొమ్మ మీద దిగులుగా విశ్రమించాను.

ఆకాశాన్నంటిన మహావృక్షాల ఛాయలు గాలికి చిన్నగా నేలమీద కదులు తున్నాయి. నిజంగా అరణ్యంలోని వెన్నెలను చూడటం ఒక అనుభూతే కాని మరణించిన స్త్రీ తలంపుకు వచ్చి మనసంతా వికలమైంది. ఆమె మరణానికి గల కారణాలను ఆలోచించాను. ఎటువంటి కారణాలు వారి వైవాహిక జీవితాన్ని ఆ పరిస్థితికి నడిపించాయో. బహుశా అతడు దుర్వ్యసనాలకు దాసుడై ఆమెను హతమార్చి ఉంటాడు. లేకుంటే ఒక భర్తకు భార్యని చంపవలసిన పరిస్థితి ఎందుకు వస్తుంది? అతను తీసుకువెళ్లిన ఆ బంగారు నగలు అతని అవసరాలను తీర్చాయో లేదో. మనుషులను అంతంచేసే అంతులేని కోరికలకి అవి తీరక కలిగే అపారమైన దుఃఖానికి అంతం ఎక్కడ? అని ఆలోచిస్తూ కూర్చున్నాను. కోరికలే దుఃఖానికి కారణమన్న తథాగతుని ఆర్యసత్యాలను తర్కించుకుంటూ ఎప్పుడు నిద్రపోయానో తెలియదు.

కళింగదేశం దాటి చాలారోజులైందనుకున్నాను. దట్టమైన అడవిమార్గం గుండా ప్రయాణించడం చేత ఎక్కడ ఉన్నానో అర్థం కావడంలేదు. ఒకరోజు కాషాయ వస్త్రాలు ధరించిన సాధువొకరు ఎదురై అరణ్యాన్ని దాటడానికి ఇంకా చాలారోజులు పడుతుందని చెప్పాడు. రోజుల తరబడి ఒక్కడినే గడపడం మూలాన మనుషుల అలికిడి కనిపిస్తే ప్రాణం లేచి వచ్చేది. అందరూ ఎదురయ్యేవాళ్లేగాని నాతో ప్రయాణించేవారెవరూ లేరు.

ఒక మధ్యాహ్నం చెట్ల తీగలు తప్పించుకుంటూ నడిచి వెళ్తుంటే భయంకరమైన కేక వినపడింది. ఎవరో ఆపదలో ఉన్న మనిషి గొంతు అని గుర్తించి దగ్గరలో ఉన్న కట్టె తీసుకుని కేక వినిపించిన దిశగా పరుగెత్తాను. నక్కలు రెండు నిర్జీవమై పడున్న ఒక మానవ మృత కళేబరాన్ని సమీపిస్తున్నాయి. అవి నా చేతిలో ఉన్న ఆయుధం చూసి దగ్గరలో ఉన్న పొదల్లోకి పారిపోయాయి. దగ్గరకు వెళ్లి చూస్తే అది నిర్జీవమైన దేహం కాదు. నాకు కళ్లు తిరిగినట్లయింది. ఎవరో పురుషుడు. అతడి మొహం చూస్తుంటే శరీరమంతా భయంతో ఒణికినట్లయింది. ఒక కన్ను, చెవులు లేవు. తలపక్క ఒక భాగాన్ని మిగతా శరీరంలోని సగభాగాన్ని జంతువులు తినేశాయి. కాళ్లు, చేతులు లేవు. ఆ క్షతగాత్రుడు నన్ను చూసి చెప్పలేనంత బాధతో అతి కష్టంమీద నోరు తెరిచి, "ఈ మృగాలు నా ప్రాణాలను విడిచి శరీరాన్ని భక్షిస్తున్నాయి. ఎప్పుడు మరణిస్తానా అని ఎదురు చూస్తున్నాను. ఇప్పుడు మీరు వచ్చారు. భిక్షువులు కరుణామయులని విన్నాను. నన్ను చంపి ఈ బాధ నుంచి విముక్తి చేయండి," అని వేడుకున్నాడు.

అతని దగ్గరకు వెళ్లడానికి భయం కలిగి నన్ను చూసి నాకు సిగ్గు కలిగింది. సమీపానికి వెళ్లి నుంచున్నాను. భయంకరమైన గాయాలు శరీరాన్ని విపరీతంగా బాధిస్తుండగా ఆ బాధను క్షాళనం చేయడానికి వృధా ప్రయాసపడుతూ అతడి శిరస్సు వణుకుతూ ఉంది. ఉన్న ఒక్క కన్నూ లోపలికి అనంతదూరంలో ఉంది. శరీరం అంతులేని బాధను నిట్టూర్పుతో మేళవించి మూలుగుతూ ఉంది.

"ఎవరు నువ్వు, ఎందుకిక్కడ గాయపడి వున్నావు?" అనడిగాను.

అతను కొంచెంసేపు మౌనంగా ఉండి, ఆ తరువాత పశ్చాత్తాపపడుతున్న నేరస్తుడిలా రోదించి, "చేసిన పాపాలు శరీరానికి తగిలిన గాయాల కంటే హృదయాన్ని ఎక్కువ బాధిస్తాయి. వాటిని మళ్లీ తలంపుకు తెచ్చుకోవడం మరింత నరకప్రాయం. అయినా క్లుప్తంగా చెప్తాను వినండి. నేనొక స్త్రీ మోహంలో పడి గుణవతి అయిన నా భార్యను చంపుకున్నాను. నేను మోహించిన ఆ స్త్రీ మరొక ప్రియునితో కలిసి నా దగ్గర ఉన్న ధనాన్ని లాక్కుని అతడి చేత నన్ను ఈ ఉదయం చంపించింది. నేను మరణించానని భ్రమపడి వాళ్లిద్దరూ అటుకేసే వెళ్లారు," అని చెప్పి ఆ క్షతగాత్రుడు అలసట తీర్చుకున్నాడు. గాయాలతో భరింపరాని బాధచేత అతని నోటి నుంచి మళ్లీ చిన్న మూలుగు వినిపించ సాగింది. కొద్దిసేపాగిన పిదప అతడు మళ్లీ అతి కష్టం మీద నోరు తెరిచి, "కనిపిస్తున్న ఆ మఱ్ఱిచెట్టు కింద కొలను ఒకటి ఉంది. కొంచెం నీరు తెచ్చి నా గాయా

లను తడిపి దాహం తీర్చండి. ఈ బాధ భరించలేను,'' అన్నాడు.

నేను వెనక్కు తిరిగి దట్టమైన ఆ మహావృక్షం కేసి నడిచాను. అతడు చెప్పినట్లు అక్కడ తటాకం ఒకటి ఉంది. కొమ్మలు కొన్ని నీటిమట్టం వైపుకు వంగి వున్నాయి. ఎవరో బస చేసినట్లుగా ఆ చెట్టు క్రింద ఒక ఆరిపోయిన పొయ్యి, వంటపాత్రలు, కొన్ని నలిగిన వస్త్రాలు ఉన్నాయి. పరిసరాలను గమనిస్తూ నా చీవరంలోంచి తోలుసంచిని బయటకు తీసి తటాకం లోకి దిగి నీటిని ముంచుకోబోతున్నంతలో మళ్లీ దిక్కులు పిక్కటిల్లుతున్నట్లు అతడి ఆర్తనాదం వినిపించింది. భయంచేత కంపిస్తున్న శరీరంతో శక్తికొలదీ తటాకంపైకి పరుగెత్తుకు వచ్చి అక్కడి దృశ్యాన్ని చూస్తూ స్తంభించిపోయాను. అయిదారు అడవి మృగాలు ఆ క్షతగాత్రుడి దేహాన్ని నోళ్లతో కరుచుకుని దగ్గరలో వున్న పొదల్లోకి లాక్కుపోతున్నాయి. అతడి నోటి నుంచి వస్తున్న ఆర్తనాదం ఆగిపోయింది. అప్పటికే అతని ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయాయి.

ఆ దృశ్యం చూస్తూ నుంచున్నచోటునే కూలబడిపోయాను. అంతవరకు నా జీవితకాలంలో మనిషి మరణాన్ని నేను నేరుగా చూడటం ఇది రెండవసారి. ఈ రకమైన భయానక దృశ్యాన్ని చూస్తానని కలలో కూడా ఎప్పుడూ అనుకోలేదు. నాకు తెలీకుండానే కంటి నుంచి ధారాపాతంగా నీళ్లు కారసాగాయి. ఎంతసేపు అలా కూర్చుండిపోయానో తెలియదు. నేను కూర్చున్న చోట మనుషులు విడిది చేసిన ఆనవాళ్లు నన్ను వెక్కిరిస్తున్నట్లు అనిపించాయి. మనిషి జీవితంలోని మంచి చెడుల, సుఖదుఃఖాల వైరుధ్యాలు కళ్ల ముందు కనిపిస్తూ అంతులేని వైరాగ్యం, అశాంతి మనసుని ఆక్రమిస్తూ ఉంది. అశాంతి ఎక్కడ లేదు? అది విశ్వమంతా ఆవరిస్తూ ఉంది. నేను చూస్తుండగా మరణించిన ఇద్దరు స్త్రీ పురుషులు ఏవో కొత్త జీవిత సత్యాలను ఆవిష్కరిస్తున్నట్లుగా ఉంది. వారు మరణించిన విధం కంటే వారి మరణానికి గల కారణాలు నన్ను భయపెడుతున్నాయి. నేను చదివి నేర్చుకున్నదాన్ని వాళ్లు తమ అనుభవంతో రుజువు చేస్తున్నారేమో? ఒకరు భర్త చేతిలో మోసపోయిన స్త్రీ. మరొకరు ప్రేయసి చేతిలో మోసపోయిన పురుషుడు. స్త్రీ పురుషులు కోరుకుంటున్నదేమిటి? చివరికి వారికి లభిస్తున్నదేమిటి? ఏది నిజం? ఏది దుఃఖం? స్త్రీ పురుషులు వివాహమనే చట్రంలో బంధింపబడ్డారు. అక్కడనుంచే స్త్రీ పురుషుల హక్కులు, స్వేచ్ఛ సమాధి చేయబడుతున్నాయి.

వివాహమనేది సంఘం ఏర్పర్చుకున్న నియమం. సంఘజీవి కానివాడు మానవుడు కాలేడు. మానవుడైన వాడు కోర్కెలను జయించలేడు. తనను తాను జయించుకోలేడు. చివరికి అశాంతిని జయించలేడు. ఈ చిక్కుముడి విడదీయలేని విధంగా బిగుసుకు పోయింది. మానవుడి అవసరాలు తీర్చలేకపోతున్న సమాజం- సమాజపు అవసరాల కోసం స్వేచ్ఛను చంపుకుంటున్న మానవుడు. పరస్పర సంఘర్షణలో నుంచే కదా అశాంతి తనకుతానుగా పెరుగుతూ వచ్చింది. మానవుని కోరికలు, వాటిని తీర్చలేని సాంఘిక నియమాలు, సమాజమనే సంకెళ్లతో బంధించబడ్డ స్త్రీ పురుష సంబంధాలు అనాది నుంచే అశాంతికి పునాదులు వేస్తూ పోయాయి. ఈ పరంపరలో ఎన్ని మరణాలు జనించనున్నాయో? వేల సంవత్సరాల మానవజాతి చరిత్రలో ఈ సంకెళ్లను ఎవరు ఛేదించగలరు?

భారమైన హృదయంతో చెప్పలేనన్ని ఆలోచనలతో అరణ్యాన్ని దాటుకుని సూర్యాస్తమయానికి ఒక గ్రామ పొలిమేరలను సమీపించాను. పశువులను ఇళ్లకు తోలుకు పోతున్న కొందరు గ్రామస్తులను అనుసరిస్తూ ఊరవతల ఉన్న ఒక పాడుబడిన సత్రాన్ని చేరుకున్నాను. అప్పటికే అక్కడ కొందరు యాత్రికులు బస చేసి ఉన్నారు. కొందరు బయట చెట్ల కింద నిప్పు ముట్టించి వంట ప్రయత్నాలలో ఉంటే కొందరు లోపల విశ్రాంతి తీసుకుంటున్నారు. వారి వేషభాషలు చూస్తూ నేను భిక్షాపాత్రను అరుగు మీద ఉంచి ఒకపక్క కూర్చున్నాను. మధ్యాన్నపుటెండ వేడిగాలి ఇంకా ఉంది. రోజుల తరబడి అరణ్యయాత్ర వల్ల శరీరం బాగా అలసిపోయి ఉంది.

నేను కూర్చున్న స్థలానికి కొద్ది అడుగుల దూరంలో ఒక విచిత్రమైన వ్యక్తి కూర్చుని ఉన్నాడు. కాషాయ వస్త్రాలు లేవుగాని మీద గొంగళి ఒకటి కప్పుకుని యోగిలా ఉన్నాడు. అతడి కళ్లు అనంతలోకాలను చూస్తున్నాయి. పక్కనే ఉన్న తంబూరాను వేళ్లతో అలవోకగా మీటుతూ ఏదో పాడుతున్నాడు. అతడిని, అతడి పాటని ఎవరూ పట్టించుకోవడం లేదు.

యువతీ యువకులారా
మీరు వివాహితులు కాకండి
వివాహితులైన యువతీ యువకులారా
మీరు బిడ్డల్ని కనకండి

*బిడ్డల్ని కన్న తల్లిదండ్రులారా*
*మీ బిడ్డల్ని భద్రంగా*
*పొత్తిళ్లలో దాచుకోండి*

ఇదీ అతని పాట యొక్క సారాంశం. తన పాట పూర్తయిన పిదప ఆ విచిత్ర వ్యక్తి తంబూరాని పక్కన పెట్టి నా వంక చూసి, "ఎవరు నాయనా నువ్వు? శాక్య ముని శిష్యులకు ఈ దేశం ఉండవలసిన చోటు కాదు. భిక్షువులకు ఇక్కడ ఆదరణ లేదు. రోజులు చాలా దారుణంగా ఉన్నాయి. ఇంకా ముందుకు వెళ్తే మరణాన్ని కోరి తెచ్చుకోవడమే," అని తన వద్దనున్న కమండలంలోని నీటిని గొంతులో పోసుకుని నావైపు తన నిశితమైన చూపు ప్రసరిస్తూ నా వివరాలు అడిగి తెలుసుకున్నాడు.

నేను ఏ రాజ్యంలోకి అడుగుపెట్టానో, అక్కడ ఎటువంటి సాంఘిక పరిస్థితులు ఉన్నాయో అతడి మాటలను బట్టి తెలుసుకున్నాను. అతను చెప్పిన దాన్నిబట్టి నేను గోదావరిని దాటి కృష్ణానదికి ఇవతల ఉన్నాను. శాతవాహనులు, ఇక్ష్వాకులు, బృహత్పలా యనుల తరువాత అతిపెద్ద రాజ్యమేదీ అక్కడ అవత రించలేదు. మౌర్యులకు పూర్వ కాలంనాటి గణతంత్ర రాజ్యాలను పోలిన వ్యవస్థే అక్కడ మళ్లీ రూపుదిద్దు కుంది. సమీప భవిష్యత్తులో అతి పెద్ద సామ్రాజ్యం అవ తరించే పరిస్థితులు లేవు. ప్రస్తుతానికి ఎవరికి వారే రాజులు. నైతిక విలువలతో నిమిత్తం లేని బలవంతు లదే రాజ్యం. సామ్రాజ్యంగా ఏర్పడిన సాంఘిక వ్యవస్థ లో బలవంతులను వంచే నియంత్రణ ఏదీలేదు. ఇటు వంటి ఆటవిక న్యాయంలో భద్రత లేదు. భద్రత లేని వాడికి శాంతి లేదు. శాంతి లేని వాడికి అహింస లేదు. ఇదంతా తెలుసుకున్న తరువాత అతడు పాడిన పాట యొక్క సంపూర్ణమైన సారాంశమేమిటో నాకు అర్థమ యింది.

అక్కడ బస చేసిన యాత్రికుల వద్ద భిక్ష స్వీకరించి ఆ రాత్రి అక్కడే విశ్రాంతి తీసుకుని మరుసటి ఉదయం కనుచూపు మేరలో ఉన్న గ్రామంవైపు నడక సాగించాను. దారి మధ్యలో శిథిలమైన శిలాగృహాలు కనిపించాయి. పోషణలేని పాడుబడిన ఆరామాల్లో అడవి వృక్షాలు అల్లుకుని ఉన్నాయి. రాతిగోడల మీద శిలాకుడ్యాలను చూస్తూ పోతుంటే కాలికి ఏదో బలంగా తగిలింది. ఏమిటా అని చూశాను. అదొక శిలా ప్రతిమ. ప్రపంచానికి అహింసామార్గాన్ని బోధించిన బుద్ధ భగ వానుని తెగిపడిన రాతి ముఖ ప్రతిమ. నీటి మడుగులో పడి ప్రాణాలకోసం పెనుగులాడుతున్నవాడిలా వంగి ఆ శిలాఫలకాన్ని చేతిలోకి తీసుకుని హృదయానికి హత్తుకున్నాను. దుఃఖంతో కళ్లు జలపూరితమయ్యాయి. పగిలిన రాయిని పట్టుకుని ఎంతసేపు రోదిస్తూ కూర్చు న్నానో తెలియదు. తథాగతుని కరుణారసపూరితమైన నిరంతర సత్యాన్వేషణలో నేనెప్పుడూ మానవుడిని ద్వేషించి ఎరుగను. కాని ఆ క్షణంలో నాకు సమస్త మానవాళి అంటే చెప్పరానంత రోత కలిగింది. మత విద్వేషమంటే నాకు తెలియకపోలేదు. ఇది మత విద్వేషం కాదు. ఇదొక చంచలమైన విచక్షణలేని ముష్కరతత్వం. భారమైన హృదయంతో ఆ శిలా ఫలకాన్ని భుజానికున్న సంచిలో దాచుకుని ముందుకు నడిచాను.

కొద్ది దూరం నడిచిన పిదప అశ్వారూఢులైన కొందరు సైనికులు ఎదురుపడి నన్ను ఆగమని సైగ చేశారు. నేను నుంచుండిపోయాను.

ఆకలిగొన్న మృగాలు ఆహారంగా చిక్కిన అల్ప ప్రాణిని చుట్టుముట్టినట్లు వారు నా చుట్టూ తమ అశ్వాలను నిలిపారు.

ఒకడు వీపుకు తగిలించి ఉన్న బల్లాన్ని చేతిలోకి తీసుకుని నా రొమ్ముకు ఆనించి, "ఎవరు నువ్వు?" అనడిగాడు.

"నేనొక బౌద్ధ శ్రమణుడిని. నాది పాటలీపుత్రాని కావల ఉన్న ఉత్తరదేశం. దక్షిణ దేశయాత్రలకని బయలుదేరాను," అని చెప్పాను.

అతడు అశ్వంమీద అలానే కూర్చుని పొడవాటి మొనదేలి ఉన్న ఆ బల్లెంతో నా రొమ్ము మీదనున్న చీవరాన్ని పక్కకి జరిపి, "లోపల ఏమి దాచావో తియ్యి," అన్నాడు.

నేను చీవరం చాటునుంచి భిక్షాపాత్రని తీసి దాని లోని ప్రాచీన శాంతవదనుడి శిలాఫలకం చూపించాను. దాన్ని చూసి అశ్వికులు ఒక్కసారిగా పెద్దపెట్టున నవ్వారు. "సరే, సరే. నీవు బౌద్ధ సన్యాసివని నమ్ము తున్నాం. ప్రాణాల మీద ఆశ ఉంటే ఎక్కడా ఆగక నీ దారిన నీవు పో," అని అశ్వాలను అదిలించి దుమ్ము రేపుకుంటూ వారు వెళ్లిపోయారు.

వాళ్లు వెళ్లినవైపు చూస్తూ చాలసేపు నుంచుండి పోయాను. శరీరమంతా చెమటపట్టి హృదయం ఒక విధమైన ఉద్వేగంతో కంపిస్తూ ఉంది. ఆ సమయంలో నన్ను చూసుకుని నేను చాలా ఆశ్చర్యపోయాను. జీవితంలో భయమంటే ఏమిటో నేనెరుగుదును. పాకే

శిశువుల నుంచి రేపోమాపో రాలిపోయే వృద్ధుల వరకు అందరూ ఎటువంటి విషయాలకు భయపడతారో నాకు బాగా తెలుసు. దొంగలు, హంతకులు ఎందుకు భయపడతారో, ఎవరిని చూసి భయపడతారో కూడా నాకు బాగా తెలుసు. కానీ ఇప్పుడొక వింతగొలిపే భయంకరమైన భయాన్ని ఈ అశ్వికులు నాకు పరిచయం చేసి వెళ్లిపోయారు. ఇది ఒకరి నుంచి మరొకరికి అంటువ్యాధిలా వ్యాపించే భయం. ఇటువంటి భయం చాలా తేలికగా వ్యాపిస్తూ పోతుంది. దాని వెనుక వున్న స్వార్థం అనైతికమైనది. దాని ప్రయోజనం రాజకీయమైనది. ఏది ఏమైనా ఇలా ప్రశ్నింపబడటాన్ని, సోదా చేయబడటాన్ని నేనెప్పుడూ ఎదుర్కోలేదు. ఇదొక భీతి గొలిపే కొత్త అనుభవం. నాకు హింస అంటే ఏమిటో తెలుసు. కాని అప్పటికింకా రాజ్యహింస అంటే ఏమిటో తెలియదు. దాని వెనుక రాజనీతి అసలే తెలియదు. రాజ్యం యొక్క మనుగడ ఈ రాజనీతి మీద ఆధారపడి ఉందా? ప్రజాశ్రేయస్సు కోసం ప్రజలను హింసించడం-నాకు నవ్వొచ్చింది.

ఆ తరువాత కాలంలో నేననేకసార్లు ప్రశ్నింపబడ్డాను. నేనొక బౌద్ధ శ్రమణుడననీ, నిర్విరామ పాద చారినని, ఏ స్థలంలోనూ మూడు దినాల కంటే ఎక్కువ రోజులు గడపననీ రుజువు చేసుకోవడానికి చాలా శ్రమ పడవలసి వచ్చింది. భిక్షువులు మూడురోజుల కంటే ఎక్కువ కాలం ఎక్కడా ఉండరాదని ఆదేశించిన సిద్ధార్థునికి మనసులో ఎన్నిసార్లు కృతజ్ఞత చెప్పుకున్నానో తెలియదు.

నేను చూసిన జన సమూహాలలో కొన్నిచోట్ల చిన్న చిన్న రాజవంశాలు పాలిస్తూ ఉన్నాయి. కొన్నిచోట్ల సామ్రాజ్యాలు పతనమై ఉన్నాయి. కొన్నిచోట్ల రాజ్య స్థాపనకు అంకురార్పణ జరుగుతూ ఉంది. మొత్తానికి అన్నిచోట్ల మనుషుల స్వేచ్ఛ, హక్కులనేవి రాజ్యమనే కబంధహస్తాల్లో ఇరుక్కుపోయాయి. నేనడుగు పెట్టిన గ్రామాలలో నన్నందరూ అనుమానంగా చూశారు. కొందరు గృహస్థులు భయంతో తలుపులు మూసుకున్నారు. తల్లులు తమ పిల్లల్ని ఒడిలోకి లాక్కున్నారు. భిక్షువులను చూసి భయపడటం ఇక్కడే చూస్తున్నాను. నాకక్కడ భిక్ష లభించలేదని చెప్పడం కంటే నేను భిక్షాపాత్ర చాచలేదని చెప్పాలి. జన సమూహంలో తిరిగినంతసేపు ప్రతి ఒక్కరు నాకు భయపడుతూ ప్రత్యేకంగా కనిపించారు.

చాలా చిన్న వయసులోనే నేను ఆరామంలో చేరడం వలన నాకు సామాజిక పరిజ్ఞానం ఎక్కువ లేదని, సంఘాన్ని మరింత చేరువలో ఇన్నాళ్లూ చూడ లేదని తెలుసుకున్నాను. వర్ణాశ్రమధర్మాలు, సమాజంలోని బీదాగొప్ప అంతరాలను చూడకముందే సంఘంలో చేరిపోయాను. ఇక ఆరామంలో ఉన్నన్నినాళ్లు ఆధ్యాత్మిక విషయాలను, తాత్విక విషయాలను అధ్యయనం చేశానేగాని సామాన్యుల జీవితాలను ఇప్పుడే చూస్తున్నాను. ముఖ్యంగా పాతుకుపోయిన వర్ణాశ్రమ ధర్మాలను చూస్తే బౌద్ధం ఆదిమకాలంలో సాంఘిక ఉద్యమంగా ఎందుకు రూపుదిద్దుకుందో అర్థమవ్వసాగింది. పరిశీలన పెరిగేకొద్దీ నాకు అనేక ప్రశ్నలు పుట్టుకొచ్చాయి.

అందరూ కలిసి సమష్టిగా జీవనం సాగిస్తున్నప్పుడు అందరికీ సమాన హోదా ఎందుకు లేదు. వర్ణాశ్రమ ధర్మాలెందుకు వచ్చాయి. సమాజం శూద్రులుగా, అగ్రవర్ణాలుగా పేదలుగా ధనికులుగా ఎందుకు విడిపోయింది. అధిక సంఖ్యాకులు సాంఘికంగా ఎందుకు అణచివేయబడుతున్నారు. సమాజం విభజింపబడినప్పుడే సమష్టి జీవితం అన్నది ఒక అబద్ధమని తెలిసిపోయింది. అన్ని స్వరాలు ఒకేలా లేవు. సంపద కల కొన్ని వర్గాలు పక్కకి జరిగిపోతున్నాయి. కొన్ని వర్గాలు అణగారిపోతున్నాయి. ఇక్కడ ఎవరి లాభాలు వారికున్నాయి. ఎక్కడి దొంగలు అక్కడ శబ్దం చేయడం లేదు. సమాజం వర్గాలుగా, కులాలుగా విడగొట్టినప్పుడే ప్రపంచాన్ని వీడిపోని అశాంతికి ఎప్పటికీ తీరని దుఃఖానికి బీజాలు ఏర్పడ్డాయి. ఒక్కసారిగా ఈ వేళ్లను పెకలించలేం. ఎవరికి వారు సత్యాన్ని తెలుసుకుని దుఃఖనివారణ జీవితం కోసం సాధన చేయాలంతే.

ఎవరికి వారిని వ్యక్తిగా చూసినప్పుడు ప్రతి ఒక్కరి హృదయం నాకొక భిక్షాపాత్రలాగే కనిపించింది. కొందరికి దయ కావాలి. కొందరికి సంపద కావాలి. కొందరికి కీర్తి కావాలి. మరికొందరికి అధికారం కావాలి. అన్నిటికంటే ముఖ్యంగా అందరికీ శాంతి కావాలి. తమకి ఏది లభించలేదో దాన్ని ఆశించడం మానవ నైజమే కదా. దుఃఖానికి హేతువులైన కోరికలు లేనిదే మానవుడు లేడు. కోరికలు జనించడానికి భయం కూడా ఒక కారణం. బాల్యం నుంచే భయం, అభద్రత, ప్రేమ రాహిత్యం వంటి కోరికలు జనించే సరంజామాని మనుషులు పోషిస్తూ పోతున్నారు. ఈర్ష్య, అసూయ, పగ వంటి రాగద్వేషాలను ఒకరికొకరు అంది పుచ్చు

కుంటూ తమ వారసులకు సంక్రమింపజేస్తూ పోతు న్నారు. కోరికలు లేకుండా జీవించడమనేది మనిషికి అందని మరింత సంక్లిష్టమైన కఠినమైన మార్గంగా తయారయ్యింది.

నేనడుగుపెట్టిన గ్రామం తరువాతి కాలంలో నేను తిరిగిన పట్టణాలకు నమూనాగా ఉంది. అధికార వర్గం అనుక్షణం ఎంత అప్రమత్తంగా ఉందో ప్రజలు పడే బాధలు చూస్తే తెలుస్తుంది. అనుక్షణం అప్రమ త్తంగా ఉన్నవారు తమను చూసి తాము భయపడు తున్నామని తెలుసుకోవాలి. నిరంతర సోదా, బెదిరించ బడటం, ప్రజలను భయపెట్టడం, అణచివేయడం అనేవి నిరంతరం జరుగుతున్నాయి. ప్రజలను హెచ్చ రించడానికి భయాందోళనలను రేకెత్తించడం ఒక రాజ కీయ ఎత్తుగడ మాత్రమే. సమస్త మానవాళి కోరుకునే శాంతి, అహింస ఏనాడో అధికార దాహంలో బందీ అయిపోయాయి. తాము తప్పు చేస్తున్నామని వాళ్లెప్ప టికీ తెలుసుకోరు. ఏ క్షణంలోనైనా అరాచకం ప్రబల డానికి అవకాశం ఎందుకుంటుంది?

నాకిదంతా సత్యానికి, అసత్యానికి జరుగుతున్న సంఘర్షణలా అనిపించింది. ఏది సత్యం, ఏదసత్యం. అధికారంకోసం, స్వార్థపూరిత ప్రయోజనాల కోసం సత్యం అసత్యంగా చెప్పబడింది. సత్యాన్ని అసత్యంగా ప్రకటించి నడివీధుల్లో ఉరితీస్తూ పోయారు. రాజ్య మేలుతున్న మొరటు న్యాయం, 'దేన్నైనా అడ్డు తొలగించుకోవాలంటే దానిని ముందుగా ప్రజల ముందు చెడ్డదిగా ప్రచారం చేయి. తరువాత వారి ముందే దాన్ని ఉరితీయి,' అనే ధోరణి అప్పుడే అలవర్చుకుంది. 'నీవు చెప్పేది తప్పు. నీవు ఆచరించేది తప్పు. నేను చెప్పేది నిజం. నీవు వెళ్లేది తప్పు దారి. నేను చెప్పేదే సరైనది,' అన్న భ్రమని ప్రజలలో కలిగించ డానికి అధికారవర్గం శాయశక్తులా ప్రయత్నించింది. తప్పు చేసినవాళ్లు శిక్షింపబడాలనే నెపంతో అనేకమంది ఏరివేయబడ్డారు. కొంతమంది అడ్డు తొలగించుకో బడ్డారు. కొందరి ఆచూకి తెలియలేదు. కొందరి మాన ప్రాణాలు హరించబడ్డాయి. కొందరి అభిమానాలు అందరి ముందు అణచివేయబడ్డాయి.

ప్రజలకు సత్యాసత్యాలతో పనిలేదు. వాళ్లకి మనుగడే ముఖ్యం. ప్రజాసంక్షేమం కోసమే అధికారం అనేవారు తమ అస్తిత్వం కోసమే ఎన్నో దురాగతాలకు ఒడిగట్టారు. ప్రజలను భయపెట్టడానికి అమాయకు లను కావాలనే దోషులుగా చూపి శిక్షించారు. ప్రజలలో భయాన్ని రేకెత్తించడం ఎంత సులువో వాళ్లలో విద్వేషాల్ని రగిలించడం కూడా అంతే సులువని అధికారంలో ఉన్నవారికి బాగా తెలుసు.

ఆలోచనని అరచేతిలో బంధించాలని, తమ శాసనాలనే సమాజం సత్యాలుగా అంగీకరించాలనే మొరటు శక్తులకు సాధ్యమైనంత దూరంగా వెళ్లిపోవా లని వడివడిగా అడుగులు వేస్తూ వేగంగా నడవ సాగాను. దారి మధ్యలో నాకు శిరస్సులేని సిద్ధార్థుని శిలావిగ్రహాలు అనేకం కనిపించాయి. వాటిని చూడగానే వ్యక్తిపూజను, విగ్రహారాధనను వ్యతిరేకించిన బుద్ధుని ప్రవచనాలు తలపుకు వచ్చేవి. అయినా అవి చూసినప్పుడల్లా నా హృదయం బాధతో బరువెక్కేది.

ఎవరో వెంట తరుముతున్నట్లు నేను సాధ్యమై నంత త్వరగా ఆ పట్టణాలను, గ్రామాలను విడిచి కృష్ణానదీ పరీవాహక ప్రాంతం దాటి మరొక అరణ్య ముఖద్వారానికి చేరుకున్నాను.

మనుషుల కోలాహలం, ఆయుధాలు, అశ్వాలు, సైనికుల పదఘట్టనలు దాటి ప్రశాంత జగత్తులోకి వచ్చి నట్లయింది. అరణ్యం ఆవిష్కరించిన సత్యాలకంటే మనుషులు జీవిస్తున్న సమాజం బీభత్సంగా కనిపిం చింది. భద్రతకి అభద్రతకి మధ్య ఎంత తేడా. ఆనాడు పాడుబడిన సత్రం అరుగుమీద సాధువు పాడిన పాట ఎంత నిజం. నేను తిరిగిన జనసమూహాలు, నగరాలు, చిన్న చిన్న పట్టణాలు, గ్రామాలు అతడి మాటలను రుజువు చేస్తున్నాయి. సంఘ జీవితం కంటే ఈ అరణ్యా వాసం ఎంత ప్రశాంతంగా ఉంది? ఈ భద్రతనిచ్చే ఈ ప్రశాంతమైన జీవితం కోసమే అనేకమంది అరణ్యావాసం చేస్తున్నారని ముందుకు వెళ్లినకొద్దీ అర్థమయింది.

మార్గమధ్యంలో తటాకం ఒకటి కనిపిస్తే దాహం తీర్చుకోవడానికి లోనికి దిగి నీటికోసం చేతులు చాచాను. నీళ్లలో కదులుతున్న నా ప్రతిబింబం నాలో ఏదో మార్పును సూచిస్తూ ఉంది. ఒకప్పటి అమాయ కత్వం పోయి, నొసల మధ్య, నుదుటి మీద గీతలు పడి చెప్పలేని గాంభీర్యమేదో చోటు చేసుకుంది. సంఘర్షణ మానవ జీవితాన్నే కాదు వర్చస్సును కూడా మార్చేస్తుంది కాబోలు. దాహం తీర్చుకుని, కాసేపు విశ్రాంతి తీసుకుని ముందుకి ప్రయాణం సాగించాను.

ఒక మధ్యాహ్నం ఒంటరినై వడివడిగా నడిచిపో తుండగా దూరంగా చెట్టు కింద ఒక మానవాకారం కని పించింది. రోజుల తరబడి ఒంటరి జీవితం గడుపు తుండటం చేత ఎవరైనా మనుషుల అలికిడి కనిపిస్తే

ప్రాణం లేచివచ్చినట్లయ్యేది. అతడిని కలుసుకుందామని నడక వేగం హెచ్చించాను. కొద్ది దూరం వెళ్లిన తరువాత మళ్లీ తిరిగి చూస్తే అంతకుక్రితం కనిపించిన మానవాకృతి ఎటో అదృశ్యమైంది. దగ్గరలోనే ఎక్కడైనా ఉండవచ్చని చెట్టు దగ్గరకి వెళ్లి నుంచున్నాను. నిర్జనమైన ఆ ప్రదేశంలో ఎవరో బస చేసినట్లుగా చెట్టుకొమ్మల మీద ఎవరివో స్త్రీ పురుషులు ధరించే వస్త్రాలు కొన్ని వేలాడదీసి ఉన్నాయి. అవి తప్ప మనుషుల ఆనవాళ్లు, అలికిడి లేవు. కొమ్మలకు వేలాడదీసిన దుస్తులను పరిశీలిద్దామని దగ్గరకు వెళ్లాను. ఆశ్చర్యం! ఆ బట్టల నిండా ఎండిపోయిన రక్తపు మరకలున్నాయి. ఎక్కడి నుంచో భరింపరాని దుర్వాసన వస్తూ ఉంది. నేను ఆశ్చర్యం నుంచి తేరుకునేలోపే చెట్టు పై నుంచి నల్లని మానవాకృతి ఒకటి కిందకు దూకింది. నా ఎదుట ఉన్నది ఒక దొంగ అని లిప్తకాలంలో అర్థమయ్యింది. అర్థమయిన తరువాత అతడిని చూసి భయం కలుగలేదు.

అతడు నడుముకు ఉన్న బాకునితీసి, "ప్రాణాల మీద ఆశ ఉంటే నీ దగ్గర ఉన్నది ఇచ్చి వెళ్లు," అన్నాడు.

అతడిని చూస్తే రోజుల తరబడి అర్థాకలితో మాడుతున్నవాళ్లా అనిపించాడు. శరీరమంతా గట్టిపడి ఒంటి మీద చర్మం బిగుసుకుపోయి ఉంది. నల్లని వస్త్రాన్ని నడుము కిందిభాగం నుంచి కాళ్ల మధ్యకు చుట్టుకున్నాడు.

నేను నవ్వి, "భిక్షువుల వద్ద చోరులకు దొరికేది ఏముంటుంది? ఈ భిక్షాపాత్ర నీకు ఉపయోగకరమైతే తీసుకో. ఇక నా ప్రాణమంటావా, అది నీకు ఆకలి తీర్చగలిగేదైతే దాన్నీ ఇవ్వడానికి నేను సిద్ధమే," అని నా భిక్షాపాత్రను అతడి ముందుంచాను.

అతడు కొద్దిసేపు నిశ్శబ్దంగా ఉన్నాడు. అనాచ్ఛాదితంగా ఉన్న అతని శరీరం మీద రకరకాల బాకులు వేలాడదీసి ఉన్నాయి. మనిషి ప్రాణం తీయడానికి ఇతనికి క్షణం పట్టదని అతడిని చూస్తే ఎవరికైనా అర్థమవుతుంది.

అతడు నన్ను, నా వస్త్రధారణను ఆపాదమస్తకం పరిశీలిస్తూ, "నీ దగ్గర తినడానికి ఏమైనా ఉన్నదా?" అనడిగాడు.

నేను ఆహారం కోసమని సేకరించుకున్న పండ్లు, అడవిలో దొరికిన దుంపలు తీసి ఇచ్చాను. నన్ను ఆశ్చర్యంతో చూసినట్లే వాటిని కూడా అతడు విచిత్రంగా చూసి చేతిలోకి తీసుకున్నాడు.

"నాకు అంతకంటే మరొక ఆహారమేమీ అక్కర్లేదు," అన్నాను.

అతడవి తీసుకుని, "ఈ దారిన వెళ్లే యాత్రికులు, బాటసారులు నన్ను చూడటం తోటే ప్రాణాలు విడిచేవాళ్లు. కొంతమంది భయంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని తలోదిక్కు పారిపోయేవారు. నా చేతికి చిక్కిన వాళ్లలో బతికినవాడివి నీవే. ఇప్పుడు నువ్వు నుంచున్న ప్రదేశంలోనే అనేకమందిని చంపి పూడ్చిపెట్టాను. నన్ను చూస్తే నీకు భయం కలగడం లేదా," అన్నాడు.

"నువ్వు ఈ హత్యలు మనుషుల మీద ద్వేషంతో చేస్తున్నావా లేక సంపదకోసం చేస్తున్నావా," అనడిగాను.

"మనుషులను ద్వేషించడం నాకు తెలియదు. కేవలం సంపద కోసమే నేనీ ఘాతుకాలు చేశాను. హత్యకు ముందు తరువాత కూడా చనిపోయిన వారినెవ్వరినీ చూడలేదు."

"కేవలం సంపద కోసమే అయితే చంపడమెందుకు?"

అతడు కాసేపు మౌనంగా ఉండి, "వాళ్లు తిరిగి దాడి చేయకుండా ఉండేందుకు చంపడం నాకు తప్పనిసరి. ప్రాణాలతో విడిచిపెట్టబడిన వారితో నాకు ప్రాణహాని లేదని నమ్మకం ఏమిటి?"

"అయితే ఒక రకంగా భయం చేత నీవీ హత్యలు చేస్తున్నావనుకోవాలి."

"కావచ్చు."

"కేవలం సంపద కోసమే నీవీ హత్యలు చేస్తే నిన్ను చూసి భయపడటంలో అర్థం లేదు. సమాజమని పిలవబడుతున్న ప్రజలు నివసిస్తున్న సంఘంలో అధికారం కోసం, రాగద్వేషాల కోసం, కీర్తి కోసం మనుషులు హతమార్చబడుతున్నారు. వాళ్లందరి కంటే నీవు ప్రమాదకరమైనవాడివి కావు."

నేను చెప్పింది అతనికి ఎంతవరకు అర్థమయ్యిందో నాకు తెలియదు. అతడిని మార్చాలని నేను అనుకోలేదు. నేను చూసివచ్చిన సమాజాన్ని, మనుష్య ప్రకృతిని తలుచుకుంటే అతడు ఎంచుకున్న మార్గానికి ప్రత్యామ్నాయం మరొకటి నాకు కనిపించలేదు. వాళ్లను తిరిగి వెనక్కి సమాజంలోకి పంపలేం. సమాజమే వాళ్లని తయారుచేయకూడదు. అంతవరకు ఆ సమస్యకు పరిష్కారంలేదు. ఆ ప్రదేశం విడిచిపెట్టినప్పుడు అతనికి ఏమి చెప్పాలో అర్థంకాక మౌనంగా నడిచి వచ్చాను. నాకు లభించిన అనుభవాలతో నేను సమాధానపడలేక

పోయాను. ప్రశ్నలతో అతడిని సంస్కరించడానికి నాకు మనస్కరించలేదు.

రోజుల తరబడి సాగిన అరణ్యయాత్ర ముగిసి సూర్య భగవానుడు పడమటి క్షితిజంలోకి అడుగు పెట్టిన ఒకానొక సంధ్యా సమయంలో నేనొక శిథిలమైన విశాలంగా ఉన్న రాతికట్టడం ముందుకు చేరుకున్నాను. చూడటానికదొక పాడుబడిన పూజామందిరంలానో, శత్రువుల దాడికి నేలకూలిన రాజమందిరంలానో వుంది. ముఖద్వారం వద్ద రాతిని కొద్దిగా లోపలివైపుకు తొలిచిన ఖాళీ ప్రదేశంలో ప్రపంచాన్ని ఆశీర్వదిస్తూ నిలువెత్తు సిద్ధార్థుడు నుంచుని ఉన్నాడు. ఎత్తయిన ఆ విగ్రహాన్ని చూడగానే తల్లి ఒడిలో చేరిన పిల్లవాడి మాదిరి పాదాల వద్దకు వెళ్లి కూర్చున్నాను. ఇన్ని రోజులు మనసుని పట్టి పీడిస్తున్న అనేక సమస్యలు కలలో జరిగినట్లు ఒక్కసారిగా అదృశ్యమై తథాగతుని కరుణా చక్షువుల చల్లని నీడలో హృదయం ఊరట చెంద సాగింది. బుద్ధుని పాదాల వద్ద నేల మీద మట్టిలో పడి ఎంతసేపు నిద్రపోయానో తెలియదు.

ఉదయారుణ కాంతులు కళ్లలోకి జొరబడటంతో మెలకువ వచ్చి కలతలు లేని నిద్ర ఎంత గాఢంగా ఉంటుందో చాలారోజుల తరువాత తెలిసి వచ్చింది. భుజం నుంచి నేల మీద చెదురుగా పడిన చీవరాన్ని ఆనుకుని సిద్ధార్థుడి శిలా ముఖప్రతిమ పడి ఉంది.

దానిని నిదానంగా చేతిలోకి తీసుకుని విగ్రహం పాదం మీద ఉంచాను. దాన్ని ఎంత దూరం అలా మోసుకుంటూ వచ్చానో తెలియదు. అది నా చెంత ఉన్నంత వరకు నేనూ ఒక ధ్వంసమయిన తలలేని శిలాప్రతిమ లానే జీవించాను. ఇన్నాళ్లూ విస్తరిస్తూ పోతున్న అశాంతికీ, హింసకీ పునాదులు అన్వేషించాను. వాటికి కారణాలు అన్ని కాలాలలోను ఒకటిగానే ఉండబోతున్నాయా అన్నది చెప్పగలిగింది భవిష్యత్తు మాత్రమే.

*అరుణతార, ఏప్రిల్ 2006*

